# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-02-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.**
2. **అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.**
4. **రాష్ట్రంలో గులియన్ బారీ సిండ్రోమ్‌పై ఆందోళన అవసరం లేదని.. వ్యాక్సిన్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టంచేశారు.**
5. **సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.**

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు చేరుకున్నారు. దూబగుంట శివారులోని.. మెటీరియల్ రికవరీ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా దూబగుంటలో ప్రజలతో కలిసి పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలు నాటుతారు. అనంతరం కందుకూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

-------------------------

భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకే ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛభారత్.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు రూపకల్పన చేశారని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఈరోజు జరిగిన స్వర్ణాంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం స్వచ్ఛ సంకల్పం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా స్వచ్ఛతను పాటించాలని.. పార్టీలకు అతీతంగా అందరూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని మంత్రి రామనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేస్తూ..

... వాయిస్...35 సెకన్లు....

-------------------------

దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. విజయవాడ న్యూ రాజీవ్ నగర్‌లో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య విధానాల స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం విజయానంద్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలు రావని తెలిపారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడం చాలా అవసరమని.. పారిశుధ్యంలో అధునాతన సాంకేతిక విధానాలను వినియోగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచిస్తూ...

...వాయిస్...37 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలో గులియన్ బారీ సిండ్రోమ్..జీబీఎస్‌పై నిరంతరం సమీక్షిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. అనంతపురంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. జీబీఎస్‌పై ఆందోళన వద్దని.. వ్యాక్సిన్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. బర్డ్ ఫ్లూ ఎక్కడా మనుషులకు సంక్రమించలేదని.. కోడి మాంసం, గుడ్ల వినియోగం విషయంలో ఇప్పటికే పశుసంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు స్పష్టత ఇచ్చారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జీబీఎస్ వ్యాధితో బాధపడుతున్న 5గురుని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు పరామర్శించి, వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ వైరస్‌కు సంబంధించి.. ప్రజలు, కోళ్ల పెంపకందారుల సందేహాలను నివృత్తి చేయడానికి విజయవాడలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు తెలిపారు. సందేహాలున్న వారు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటలలోపు 0866 2472543, 94911 68699 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

---------------------------

తిరుపతి, తిరుమల పరిధిలో చిరుతపులుల సంచారం నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. విజిలెన్స్ సిబ్బంది గస్తీ ముమ్మరం చేశారు. అలిపిరి నుంచి తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులను ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు యథావిధిగా అనుమతిస్తున్నారు. అనంతరం 70 నుంచి 100 మంది భక్తులను ఒకేసారి పంపుతున్నారు. 12 సంవత్సరాలలోపు వయస్సు చిన్నారులను మధ్యాహ్నం నుంచి అనుమతించడం లేదు. రాత్రి 9 గంటల 30 నిమిషాల తరువాత అలిపిరి నడక మార్గాన్ని మూసివేస్తున్నారు.

---------------------------

బంజారాల ఆరాధ్యమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఈ రోజు. సంస్కరణవాది, ఆధ్యాత్మిక గురువైన సంత్ సేవాలాల్ మహారాజ్ అనంతపురం జిల్లా గుత్తి పట్టణ సమీపంలోని గొల్లలదొడ్డి గ్రామంలో జన్మించారు. బంజారాల సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ... ఆ జాతి ఉద్ధరణ కోసం ఆ మహనీయుడు అనేక విధాలుగా కృషి చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్ తన పాటలు, రచనల ద్వారా కూడా ప్రజలను జాగృతం

చేశారు. కాగా.. సంత్ సేవాలాల్ మహారాజ్ సేవలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. దేశమంతా పర్యటించిన సంత్ సేవాలాల్ సమాజాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు సూచించారని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో సంత్ సేవాలాల్ మహారాజ్‌కు ముఖ్యమంత్రి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...

..వాయిస్... 25 సెకన్లు

---------------------------

అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఈరోజు సాయంత్రం వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆదాయపన్నుశాఖ చీఫ్ కమిషనర్ వీరేందర్ మెహతా, గౌరవ అతిథిగా విజయవాడ డివిజినల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ హాజరవుతారని.. కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పన్ను చెల్లింపుదారులకు సన్మానం, ప్రతిభ చూపిన ఉద్యోగులకు ధ్రువపత్రాలు అందజేయనున్నారు.

---------------------------

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. రైతు దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో అనంతపురం ఆకాశవాణి ప్రాంతీయ కార్యాలయం నిర్వహించిన కిసాన్ దివస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మతో పాటు ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మాట్లాడుతూ ఆకాశవాణి రైతుల కోసం ఎన్నో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రైతులను ఉత్తేజితులను చేయడం సంతోషంగా ఉందని వివరించారు.

అదే విధంగా ఆకాశవాణి తిరుపతి కేంద్రం ఆధ్వర్యంలో ఈ రోజు రైతు సదస్సు నిర్వహించారు. రైతు సోదరుల సౌలభ్యం కోసం పెనుమూరు పులిగుండేశ్వర ఎఫ్‌పీసీ మ్యాంగో భవన్‌లో నిర్వహించిన ఈ సదస్సుకు చిత్తూరు జిల్లా స్థాయి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు ఆధునిక వ్యవసాయ మెళకువలను, యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతు సదస్సు ద్వారా మెరుగైన వ్యవసాయ విధానాలను తెలుసుకోగలిగామని, రైతులు ఆకాశవాణికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ మోహన్ పర్యవేక్షించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గర్భిణులు, బాలింతల్లో రక్త హీనతను తగ్గించడంతో పాటు మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా ఏఐ సాయంతో జననీ మిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఈ యాప్‌ను రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అనంతపురం జిల్లా కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో స్వస్తి అనే సంస్థతో కలిసి అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, సహాయ కలెక్టర్ వినూత్నతో కలిసి నిన్న ఆయన ఈ యాప్‌ను ప్రారంభించారు. ఈ

సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు యాప్‌ను వినియోగించడం వల్ల రోజూ వారు తినే ఆహారంతోపాటు, ఆరోగ్య సంబంధ విషయాలను పరిశీలించుకునే వీలుంటుందన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 27 సెకన్లు....

========================